పద పదవే వయ్యారి గాలి పటమా!

- పాతబస్తీలో పతంగుల విక్రయాలు మరూ
- ఆకట్టుకుంటున్న వెరైటీ గాలిపటాలు
- 2007 నుంచి చైనా మాంజా నిషేధం
- లోకల్ మాంజాలకు పెరిగిన గిరాకీ


గుల్జార్‌హౌస్ వద్ద పతంగుల ఖరీదు చేస్తున్న వినియోగదారులు


వివిధ రకాల పతంగులు

చార్మినార్: పాతబస్తీలో పతంగుల సందడి మొదలైంది... రాబోయే సంక్రాంత్రి పండుగను పురస్కరించుకొని పాతబస్తీలోని గుల్జార్‌హౌజ్, చార్‌కమాన్,డబీర్‌పురా, దూద్‌బౌలి, పురానా పూల్ తదితర ప్రాంతాల్లోని పతంగుల దుకాణాలు వియోగదారులతో కిటకిటలాడు తున్నాయి. పతంగులను అన్ని వర్గాల వారు ఎగుర వేస్తారు కావున పతంగుల పండుగ మత సామరస్యానికి చిహ్నంగా నిలుస్తుంది. ఈ పండుగలో పాతబస్తీ యువకులు, చిన్నారులు పోటీ పడి మరీ పతంగులను ఎగుర వేస్తారు. పాతబస్తీలో గతేడాది కన్నా ఈసారి పతంగులు, మాంజాల ధరలు పెరిగినప్పటికీ..లెక్క చేయకుండా ఖరీదు చేస్తున్నారు.

సంక్రాంతి పండుగకు నెల రోజుల ముందు నుంచే పాతబస్తీలో పతంగుల సందడి మొదలైంది. ఇప్పటికే నగరంలోని పలు ప్రాంతాలలో పతంగుల దుకాణాలు పెద్ద సంఖ్యలో వెలిశాయి. చిన్నా... పెద్దా అనే తారతమ్యం లేకుండా పతంగులను ఖరీదు చేయడానికి వస్తుండటంతో పతంగుల దుకాణాల వద్ద రద్దీ పెరిగింది. రాకెట్, స్పైడర్ మ్యాన్, సినిమా నటులు, క్రికెట్,టెన్నిస్ క్రీడాకారుల ఫొటోలతో రూపొందించిన పతంగులు చిన్నారులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి.

అంతా మాంజా మహిమే..

ఎగిరే గాలిపటానికి దారం....ఆధారం. ఎదుటి వారి పతంగులను కట్ చేయడానికి మాంజా అవసరం. పతంగులు ఎగిరేసేటప్పుడు దారానికి ముందు కొద్దిగా మాంజాను ఉపయోగిస్తారు. అందుకే పతంగుల పండుగలో మాంజాదే కీలకపాత్ర. మాంజాల తయారీలో పాతబస్తీకి ప్రాధాన్యం వహిస్తోంది. ఇక్కడ తయారైన మంజాలను ఖరీదు చేయడానికి నగరానికి చెందిన యువకులే కాకుండా శివారు జిల్లాల యువకులు సైతం ఉత్సాహం చూపుతారు. దీంతో పాతబస్తీలో మాంజాల గిరాకీ ఎక్కువగా ఉంటుంది. గత కొన్నేళ్లుగా చైనా మాంజాలను నిషేధించడంతో దేశీయంగా తయారయ్యే మాంజాలకు గిరాకీ పెరిగింది.

తయారీలు ముస్లిం కుటుంబాలే కీలకం:

వీటిని తయారు చేయడంలో ముస్లిం కుటుంబాలే ఎక్కువగా నిమగ్నమై ఉంటాయి. పతంగులను తయారుచేసేది ముస్లింలైతే..... ఎగురవేసేది మాత్రం ఎక్కువగా హిందువులు. అక్కడక్కడా ముస్లిం చిన్నారులు, యువకులు పతంగులను ఎగిరేస్తుండటంతో ఈ పండుగ మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. కొన్ని కుటుంబాలు కేవలం పతంగుల సీజన్‌లో మాత్రమే మాంజాలను తయారు చేస్తుండగా.....మరికొన్ని కుటుంబాలు ఏడాది పొడవునా వీటినే తయారుచేసి విక్రయిస్తుంటారు. పాతబస్తీలోని కొన్ని కుంటుంబాలు 60 ఏళ్లకు పైగా ఈ వ్యాపారాన్ని నిర్వహిస్తున్నాయి.

మాంజాల తయారీ విధానం:

సుప్రీం, ఆకాశ్, సి–28, పాండ, వర్ధమాన్, గస్ తదితర రకాలలో లభించే దారాలను ముందుగా ఎంపిక చేస్తారు. ఈ దారాలను సమాంతరంగా కట్టి ప్రత్యేకంగా తయారు చేసిన మాంజాతో రుద్దుతారు. మాంజా తయారుచేయడానికి గాజు పెంకులు, అన్నం, జిగురు, కలబంద, బ్రహ్మజెముడు తదితర పదార్థాలను వినియోగిస్తారు. వీటన్నింటినీ కలిపి ముద్దగా తయారు చేస్తారు. అవసరాన్ని బట్టి కలర్‌లను వినియోగిస్తారు. ఈ విధంగా తయారైన ముద్దతో దారానికి రుద్దడంతో మాంజా తయారవుతుందని పాతబస్తీ మాంజ తయారీదారులు చెబుతున్నారు.

పలు రకాలు:

ఆయా రంగులను బట్టి మాంజాలో వివిధ రకాలుంటాయి. మాంజాలాను ×గీటి՝లుగా విక్రయిస్తారు. ఒక్కో గీటి 45 మీటర్లుంటుంది. మోతీయా, గంధక్, ఫెరోజ్, టీలా, హరా, కాశ్మీ, ఎర్రగులాబి, కొంలా, కాలా, అండ, డిస్కో, రేడియం తదితర రకాలుంటాయి. వీటిలో పాండా, సి–28 మాంజాలకు ఎక్కువగా గిరాకీ ఉంటుంది. 2007 నుంచి చైనా నుంచి దిగుమతి అవుతున్న ప్లాస్టిక్ మాంజాలను ప్రభుత్వం నిషేధించడంతో తమ మాంజాలకు గిరికీ పెరిగిందని పాతబస్తీ మాంజా తయారీదారులు అంటున్నారు.

ఉద్యోగ అవకాశాల కల్పనకు కృషి


ఎంఓయూ పత్రాలతో రిజిస్ట్రార్ కొడాలి సుందర్‌కుమార్ తదితరులు

విజయనగర్‌కాలనీ: విద్యార్థులకు మెరుగైన విద్యనందించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంపొందించేందుకు తన వంతు కృషి చేస్తున్నానని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ రిజిస్ట్రార్, ప్రొఫెసర్ కొడాలి సుందర్ కుమార్ అన్నారు. మంగళవారం మాసబ్‌ట్యాంక్ జేఎన్ఏఎఫ్ఏయూలో రిసొల్యూట్ కంపెనీ, ఏఆర్–వీఆర్ కోర్సుల ట్రైనింగ్ ఇచ్చే సంస్థ సైమాక్ ప్రైవేట్ లిమిటెడ్‌తో అవగాహన (ఎంఓయు) ఒప్పందం కుదుర్చుకున్నారు. కార్యక్రమంలో రిసొల్యూట్ కంపెనీ హెడ్ లీగల్ అండ్ ఏపీఆర్ అడ్వకేట్ సుభజీత్ సాహో, సైమాక్స్ సంస్థ ఫౌండర్ ఆర్కిటెక్ట్ గౌరీశంకర్, జేఎన్ఏఎఫ్ఏయూ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్ డైరెక్టర్ వి.ఫణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

మజ్లిస్‌కు పెరుగుతున్న ప్రజాభిమానం


ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్‌ను సన్మానించిన దృశ్యం

గోల్కొండ: మజ్లిస్ పార్టీకి ప్రజాభిమానం రోజు రోజుకూ పెరుగుతోందని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయనను గోల్కొండ బడా బజార్‌లో ఎస్ఎస్ ఎంటర్ ప్రైజెస్ ఆధ్వర్యంలో ఆయన ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మజ్లిస్ పార్టీకి అన్ని వర్గాల ప్రజల మద్దతు లభిస్తోందన్నారు. కార్వాన్ నియోజకవర్గంలో మజ్లిస్ పార్టీ తరపున తాను మూడవసారి అత్యధిక మెజార్టీతో గెలవడం పార్టీకి ఉన్న ఆదరణను తెలుపుతోందని అన్నారు. వరుసగా మూడవసారి తనను గెలిపించిన కార్వాన్ ప్రజలకు తాను ఎప్పుడూ రుణపడి ఉంటానని, అందరికీ అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరిస్తానని ఆయన అన్నారు. మజ్లిస్ అధినేత ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ప్రోత్సాహం వల్లే ఎందరో యువకులు పార్టీలో పని చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, ఎస్ఎస్ ఎంటర్ ప్రైజెస్ నిర్వాహకుడు, న్యాయవాది మిర్జా ఎక్బాల్ అహ్మద్, మిర్జా జమీల్ అహ్మద్, ఎం.జలీమ్ అహ్మద్ తదితరులున్నారు.

వైకుంఠ ఏకాదశికి అన్ని సదుపాయాలు కల్పిస్తాం


బ్రోచర్‌ను విడుదల చేస్తున్న కార్పొరేటర్లు ..

జియాగూడ: దేశంలోనే జియాగూడ రంగనాథ ఆలయంలో నిర్వహించే వైకుంఠ ఏకాదశి వేడుకలు ప్రత్యేకత సంతరించుకున్నాయని జియాగూడ, బేగంబజార్, గోషామహాల్ కార్పొరేటర్లు బోయిని దర్శన్, శంకర్ యాదవ్, లాల్‌సింగ్ అన్నారు. మంగళవారం జియాగూడ రంగనాథస్వామి దేవస్థానంలో ఆలయ ప్రతినిధి శేషాచార్యుల ఆధ్వర్యంలో వైకుంఠ ఏకాదశి వేడుకల బ్రోచర్‌ను విడుదల చేశారు. అనంతరం కార్పొరేటర్లు మాట్లాడుతూ... వైకుంఠ ఏకాదశి వేడుకలకు ప్రభుత్వ విభాగాల ద్వారా అన్ని సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ముఖ్యంగా జీహెచ్ఎంసీ, ఆర్ అండ్ బీ, విద్యుత్, వాటర్, పోలీసు బందోబస్తు, ట్రాఫిక్ మళ్లింపు, మద్యం దుకాణాల మూసివేత, పరిసరాల పరిశుభ్రత తదితర చర్యలు తీసుకుంటామన్నారు. ఆలయ ప్రతినిధి శేషాచార్యులు మాట్లాడుతూ, జియాగూడ రంగనాథ స్వామి దేవస్థానంలో గత 30 సంవత్సరాలుగా వైకుంఠ ఏకాదశి మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నామని, ప్రతి యేటా భక్తుల తాకిడి పెరుగుతున్నందువల్ల ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రభుత్వం, భక్తులు సహకరించాలని కోరారు. ఇప్పటికే ధనుర్మాస ఉత్సవాలు కొనసాగుతుండగా, ఈ నెల 23 నుంచి 27 వరకు వైకుంఠ ఏకాదశి వేడుకలు, వైకుంఠ ద్వార దర్శనం ఉంటుందన్నారు. దేవస్థానం వ్యవస్థాపక ట్రస్టీ ఎస్‌టీ చారి, కుల్సుంపురా ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్, సంఘ సేవకుడు డీవీఎస్ రాజు, బద్రినాథ్ చారి, సందీప్‌లాల్, బీజేపీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మంత్రి శ్రీధర్ బాబును కలిసిన పెన్షనర్స్ సంఘం నేతలు



నాంపల్లి: రాష్ట్ర శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును తెలంగాణ పెన్షనర్స్ కేంద్ర సంఘం నేతలు కలిశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గాజుల నర్సయ్య నేతృత్వంలో మంగళవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి అభినందించారు. కార్యనిర్వాహక అధ్యక్షుడు టి.ప్రేమ్‌కుమార్, ఉపాధ్యక్షుడు మొహమ్మద్ రఫీయుద్దీన్, శ్రవణ్‌కుమార్, గ్రేటర్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు హెచ్.రాములు పాల్గొన్నారు.

పాతబస్తీ అభివృద్ధికి అక్బరుద్దీన్ కృషి


అక్బరుద్దీన్ ఒవైసీని అభినందిస్తున్న ప్రమోద్‌కుమార్ జైన్

చార్మినార్: ఎమ్మెల్యేగా డబుల్ హాట్రిక్ సాధించిన చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీని పురానాపూల్ డివిజన్‌కు చెందిన మజ్లిస్ పార్టీ సీనియర్ నాయకుడు ప్రమోద్‌కుమార్ జైన్ మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ప్రమోద్‌కుమార్ జైన్ మాట్లాడుతూ, అక్బరుద్దీన్ ఒవైసీ కేవలం చాంద్రాయణగుట్ట నియోజక వర్గంలోని ప్రజల సంక్షేమం కోసమే కాకుండా ఎంపీ అసదుద్దీన్ ఒవైసీతో కలిసి పాతబస్తీలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి పాటుపడుతున్నారని ప్రమోద్‌కుమార్ జైన్ అన్నారు.

కనుల పండువగా సందల్ ఊరేగింపు

దూద్‌బౌలి: దూద్‌బౌలిలోని చారిత్రాత్మక షరీఫ్ హజ్రత్ సిరాజ్ అలీ షా దర్గా ఉర్సు ఉత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాలకు దర్గాను రంగు రంగుల విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. ఈ సందర్భంగా సందల్ ఊరేగింపు కనుల పండువగా జరిగింది. అనంతరం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మత పెద్దలు సజ్జాద్ హుస్సేన్ ఖాద్రీ, వాహిద్ హుస్సేన్ ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.

గ్రేటర్ అభివృద్ధికి సీఎం సమావేశం ఏర్పాటు చేయాలి

గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజాసింగ్

అబిడ్స్: గ్రేటర్ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించాలని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. గ్రేటర్ నలుమూలలా అభివృద్ధి జరగాలంటే ముందుగా జీహెచ్ఎంసీ కమిషనర్, ఇతర అధికారులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులతో ముఖ్యమంత్రి వెంటనే సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. మంగళవారం జోనల్ కమిషనర్ వెంకటేష్ దోత్రే ఆధ్వర్యంలో అధికారులు, ప్రజా ప్రతినిధుల సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో ఎమ్మెల్యే రాజాసింగ్ మాట్లాడుతూ, హైదరాబాద్ తెలంగాణకు గుండెకాయలాంటిదని, ప్రముఖ వ్యాపార కేంద్రాలు ఉన్న బేగంబజార్ లాంటి ప్రాంతాలు హైదరాబాద్‌కు ఎంతో ముఖ్యమని గుర్తుచేశారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న గోషామహల్‌లోని అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు పూర్తి చేయాలన్నారు. కొంతమంది కాంట్రాక్టర్లకు జీహెచ్ఎంసీ డబ్బులు చెల్లించకపోవడంతో పనులు కాక ప్రధాన సమస్యగా మారిందన్నారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ వెంకటేష్ దోత్రే మాట్లాడుతూ.... గోషామహాల్ నియోజకవర్గంలోని పెండింగ్ పనులన్నీ ఐదు రోజుల లోపల ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. అన్ని ప్రాంతాల్లో సంబంధిత ఏఈలు, డీఈలు, ఈఈలు, డిప్యూటీ కమిషనర్ ప్రతి రోజూ పర్యటించి అభివృద్ధి పనులు పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

మల్లు రవికి ఆత్మీయ సత్కారం


మల్లు రవిని సన్మానిస్తున్న భీమ్‌రెడ్డి తదితరులు

గన్‌ఫౌండ్రీ: ప్రజల రాజ్యంలో ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజలకు సేవకులేనని పీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి అన్నారు. రవీంద్రభారతిలో శృతిలయ ఆర్ట్స్ అకాడమీ, సీల్‌వెల్ కార్పొరేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో పీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవికి ఆత్మీయ సత్కారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సినీ సంగీత విభావరి ఆహూతులను ఆకట్టుంది. కార్యక్రమంలో సీల్‌వెల్ కార్పొరేషన్ సీఎండీ బండారు సుబ్బారావు, శృతిలయ ఆర్ట్స్ అకాడమీ చైర్మన్ భీమ్‌రెడ్డి, సరస్వతి ఉపాసకుడు దైవజ్ఞశర్మ, కళా పత్రిక సంపాదకులు మహ్మద్ రఫీ, శృతిలయ ఆర్ట్స్ వ్యవస్థాపక కార్యదర్శి ఆమని పాల్గొన్నారు.

'నాగలి కూడా ఆయుధమే' ఆవిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య కొలకలూరి ఇనాక్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో పాలపిట్ట బుక్స్ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత కొమ్మవరపు విల్సన్‌రావు రచించిన 'నాగలి కూడా ఆయుధమే' పుస్తకావిష్కరణ సభ మంగళవారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశ్రీ పురస్కార గ్రహీత ఆచార్య కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ... నేటి యువతరానికి వ్యవసాయం, పనిముట్లు, ఉపయోగాలు వంటి విషయాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. కార్యక్రమంలో ప్రముఖ సంపాదకుడు కె.శ్రీనివాస్, ప్రముఖ కవి కె.శివారెడ్డి, హెచ్‌సీయూ తెలుగుశాఖ అధ్యక్షుడు డి.వెంకటేశ్వర్‌రావు, సాహితీవేత్త కె.కోటేశ్వరరావు, కవులు ఎం.నారాయణ శర్మ, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

దేవులపల్లి సుమాలికకు తెలుగు ఐకాన్ అవార్డు

అబిడ్స్: నగరానికి చెందిన దేవులపల్లి సుమాలికకు తెలుగు ఐకాన్ అవార్డు లభించింది. కెనడాలో జరిగిన తెలుగు వైభవంలో క్లాసికల్ డ్యాన్సర్‌గా పలు ప్రదర్శనలు ఇచ్చినందుకు, రెండు చేతులతో మిర్రర్ ఇమేజ్‌లో ఏకకాలంలో రాసినందుకు అవార్డు లభించింది. నాంపల్లిలోని టీసీటీఎన్‌జీఓ సెంట్రల్ అసోసియేషన్ నాయకుడు, అసిస్టెంట్ కమర్షియల్ ట్యాక్స్ అధికారి దేవులపల్లి శ్రీనివాసరావు కుమార్తె దేవులపల్లి సుమాలిక తెలుగు ఐకాన్ అవార్డు పొందడంతో పెద్ద ఎత్తున సంబురాలు జరుపుకున్నారు. సుమాలికను సిఫా ఆధ్వర్యంలో అవార్డుతో పాటు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సుమాలిక మాట్లాడుతూ, అవార్డు లభించడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు. అవార్డు గ్రహీతను నాంపల్లిలోని పలు వాణిజ్యపన్నుల శాఖ కార్యాలయాల అధికారులు, సిబ్బంది అభినందించారు.


అవార్డు అందుకుంటున్న సుమాలిక

భక్తిశ్రద్ధలతో పూజలు


పూజల్లో పాల్గొన్న భక్తులు

గోల్కొండ: షేక్‌పేట మారుతీనగర్‌లోని విజయగణపతి, గురుదత్తాత్రేయ స్వామి, సుబ్రహ్మణ్య స్వామి, నాగదేవత అమ్మవార్ల 13వ వార్షిక మహోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త పూస బాబూరావు ఆధ్వర్యంలో తోకల సాయిబాబు, కౌసల్య సౌజన్యంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 10 గంటలకు గణపతి హోమం, 11 గంటలకు మహాక్షీరాభిషేకం, అలంకరణ, అర్చన, మంగళహారతీ, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు జరిగాయి. మధ్యాహ్నం అయ్యప్ప భక్తులకు భిక్ష ఏర్పాటు చేశారు. సాయంత్రం 4 గంటలకు మైసమ్మ ఆలయం నుంచి నాగదేవత ఆలయం వరకు సామూహిక బోనాలు, తొట్టెల ఊరేగింపు కార్యక్రమం జరిగింది. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున ఉత్సవాల్లో పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రుల్లో మరింత మెరుగైన వైద్య సేవలు


మాట్లాడుతున్న రాష్ట్ర ఆరోగ్యశాఖ క్వాలిటీ మేనేజర్ రాము

గోల్కొండ: ప్రభుత్వాసుపత్రుల్లో మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర ఆరోగ్య శాఖ క్వాలిటీ మేనేజర్ రాము అన్నారు. ఆసుపత్రుల్లో శానిటేషన్, వైద్య సౌకర్యాలు తదితర విషయాలపై మంగళవారం గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆసుపత్రిలో శుభ్రతకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. శుభ్రతతో రోగాలను దూరంగా ఉంచగలుగుతామన్నారు. ఔట్ పేషంట్స్ ఓపీ నుంచి ఇన్ పేషంట్స్ వార్డు వరకు శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పోస్టు సర్జరీ వార్డుల్లో రోగుల సహాయకులు ప్రవేశిస్తే రోగులకు ఇన్‌ఫెక్షన్ సోకే ప్రమాదం ఉందని, అందువల్ల ఆ వార్డుల్లో సహాయకుల ప్రవేశం కనిపించరాదన్నారు. వైద్యులతో పాటు వైద్య సిబ్బంది, నర్సులు, వార్డు బాయ్‌లు.. ఇలా ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మాస్కులు ధరించాలని ఆయన సూచించారు. ఆసుపత్రి మెడికల్ సూపరెంటెండెంట్ డాక్టర్ మజహర్ ఉల్లా మాట్లాడుతూ, ఆసుపత్రిలో ఇన్‌ఫెక్షన్ ప్రబలకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆర్ఎంఓ డాక్టర్ శ్రీనివాసరావు, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భాషాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం


సమావేశంలో డిప్యూటీ ఈఓ, ఉపాధ్యాయులు

యాకుత్‌పురా: భాషాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని బహదూర్‌పురా మండల డిప్యూటీ ఈఓ మహ్మద్ ముకర్రం అలీ అన్నారు. బహదూర్‌పురా మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో హరిబ ౌలి రిఫాయం ఉన్నత పాఠశాలలో మంగళవారం మాతృ భాష ఉన్నతి, అభివృద్ధిపై సమావేశం నిర్వహించారు. సమావేశాన్నికి ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ ఈఓ మాట్లాడుతూ... మాతృభాషతో పాటు ద్వితీయ భాష ఎంతో ముఖ్యమన్నారు. విద్యార్థులకు చదవడం, చదివింది అర్థం చేసుకోవడం, వాటిని వ్యక్తం పర్చడం భాష ఉన్నతి మూల సూత్రాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఐఓ ఎస్ హరినారాయణ, పలు ప్రభుత్వ పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయులు సాజీద్‌అలీ," పద్మజాకుమారి, మధుసూదన్, రిసోర్స్ పర్సన్లు డాక్టర్ విజయ్‌భాస్కర్, కరుణకర్‌రెడ్డి, మీనాకుమారి, కవిత, ఉపాధ్యాయులు డాక్టర్ శ్రీవాటి శ్రీనాథ్ పాల్గొన్నారు.

అక్రమ పార్కింగ్‌లను ఉపేక్షించం: ఏసీపీ

నాంపల్లి: లక్డీకాపూల్ నుంచి క్రిమినల్ కోర్టుకు వెళ్లే ఫ్యాప్సీ మార్గంలో రోడ్డుపై అక్రమంగా పార్కింగ్ చేసిన వాహనాలపై ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝుళిపించారు. అక్రమంగా పార్కింగ్ చేసిన వాహనాలను క్రేన్‌తో లిఫ్ట్ చేయడంతో పాటు వాహనదారులకు ఛలాన్లు విధించారు. మంగళవారం నాంపల్లి ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలో అక్రమ పార్కింగ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎన్నిసార్లు పోలీసులు హెచ్చరించినా పెడచెవిన పెట్టే వాహనదారులకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి గుణపాఠం చెప్పారు. క్రిమినల్ కోర్టుకు వెళ్లే రహదారి ఎల్లప్పుడూ రద్దీగా ఉంటోంది. రోడ్లు, ఫుట్‌పాత్‌లపై వాహనదారులను పార్కింగ్ చేస్తుండటంతో పాదచారులు వెళ్లేందుకు దారి ఉండటం లేదు. అక్రమ పార్కింగ్‌లతో ఎక్కడికక్కడ ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ట్రాఫిక్‌ను క్లియర్ చేయడానికి పోలీసుల తల ప్రాణం తోకకు వచ్చినట్లు అవుతోంది. ఈ స్పెషల్ డ్రైవ్ ట్రాఫిక్ ఏసీపీ రత్నం నేతృత్వంలో నాంపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఆనంద్ పర్యవేక్షణలో ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఏసీపీ రత్నం మాట్లాడుతూ, రోడ్లపై పార్కింగ్‌లను ఉపేక్షించేది లేదన్నారు. ఫుట్‌పాత్‌లను ఆక్రమించే వ్యాపారులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఫుట్‌పాత్‌లపై పాదచారులు నడిచేందుకు వెసులుబాటు కల్పించాలని కోరారు.

రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా తీర్చిదిద్దుతాం


మంత్రిని సత్కరించిన గౌరి సతీష్ తదితరులు

అబిడ్స్: తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరి సతీష్ అన్నారు. మంత్రి సీతక్కను ఆయన ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గౌరి సతీష్ మాట్లాడుతూ, కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణను అప్పుల పాల్జేసిందన్నారు. రూ.5 లక్షల కోట్ల అప్పులు చేసిన కేసీఆర్‌ను, ఆయన ప్రభుత్వాన్ని ప్రజలు ఛీ కొట్టినా వారికి ఇంకా కనువిప్పు కావడం లేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హయాంలో తెలంగాణను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి హైదరాబాద్‌ను దేశంలోనే అగ్రగామి నగరంగా తీర్చిదిద్దుతామన్నారు.

జనవరి 3,4 తేదీల్లో ఆల్ ఇండియా మహిళా కాన్ఫరెన్స్

గోల్కొండ: వచ్చే నెల 3,4వ తేదీల్లో జరగనున్న ఆల్ ఇండియా మహిళా కాన్ఫరెన్స్‌ను విజయవంతం చేస్తామని రాష్ట్ర వక్ఫ్ బోర్డు మాజీ సభ్యుడు వాహిద్ అహ్మద్ అన్నారు. కాన్ఫరెన్స్ ఏర్పాటు విషయాలపై చర్చించడానికి మంగళవారం టోలిచౌకీలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో జరిగిన కాన్ఫరెన్స్‌ను అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ సహకారంతో విజయవంతం అయ్యాయని అన్నారు. అయితే ఈ సారి కూడా వీటిని విజయవంతం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ముఫ్తీ, మహ్మద్ మస్తాన్ అలీ ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.

ముందు జాగ్రత్తలతో కేన్సర్ నివారణ


ఇబ్రహీంబాగ్ లో వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు తదితరులు

లంగర్‌హౌస్: కేన్సర్, గుండె జబ్బులపై అవగాహనతో ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటే వ్యాధులను అరికట్టవచ్చని రెనోవా ఆస్పత్రి డైరెక్టర్లు డాక్టర్ నగేష్, డాక్టర్ శివకుమార్ అన్నారు. లంగర్‌హౌస్‌లోని రెనోవా ఆస్పత్రి, రోటరీ క్లబ్, ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రి సంయుక్తంగా రాందేవ్‌గూడ, ఇబ్రహీంబాగ్, వాసవీ కళాశాల ప్రాంతాల్లో మంగళవారం ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 500 మంది మహిళలకు ఉచితంగా కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. గుండె జబ్బులు, ఆర్థోపెడిక్ సమస్యలపై అవగాహన కల్పించారు.ఈ సంద్భంగా వైద్యులు మాట్లాడుతూ, సమాజానికి సమగ్ర ఆరోగ్య సంరక్షణ సేవలను అందించడం లక్ష్యంగా వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. అదేవిధంగా స్థానికులకు కాంప్లిమెంటరీ కార్డియో పరీక్షలు, ఆర్థోపెడిక్, ఎముకల పటిష్టత పరీక్షలు నిర్వహించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించామన్నారు. శిబిరంలో ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ షూబ్, సీనియర్ కార్డియాలజిస్టు డాక్టర్ జాబీ, డాక్టర్ ఆసిఫ్ మిర్జా, సంఘ సేవకులు రాజు వస్తాద్ పాల్గొన్నారు.

శబరిమలలో తెలుగు రాష్ట్రాల అయ్యప్పల సమస్యలు పరిష్కరించాలి


సమావేశంలో నినాదాలు చేస్తున్న అయ్యప్ప స్వాములు

అఫ్జల్‌గంజ్: అయ్యప్ప స్వాములపై జరుగుతున్న దాడులు, శబరిమలలో స్వాములు ఎదుర్కొంటున్న ఇబ్బందులను రెండు తెలుగు రాష్ట్రాల పాలకులు పరిష్కరించాలని అయ్యప్ప ఐక్యవేదిక విజ్ఞప్తి చేసింది. మంగళవారం ఉస్మాన్‌గంజ్‌లోని భాగ్యనగర్ అయ్యప్ప సేవా సమితి కార్యాలయంలో తెలంగాణ అయ్యప్ప జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో జంట నగరాల గురుస్వాములు అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శబరిమలలో అయ్యప్ప స్వాములు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై చర్చించారు. ఐక్యవేదిక ప్రతినిధులు బుచ్చిరెడ్డి గురుస్వామి, బాలకృష్ణ గురుస్వామి, క్యాతం రాధాకృష్ణ గురుస్వామి, ప్రేమ్ గాంధీ గురుస్వాములు మాట్లాడుతూ... శబరిమలలో కనీస ఏర్పాట్లు చేయకపోవడంతో తెలుగు రాష్ట్రాల స్వాములు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అన్నప్రసాదం, మంచినీరు, రవాణా సౌకర్యం, వైద్య సదుపాయాలు లేక స్వాములు కష్టాలు పడుతున్నారని, తక్షణమే కేరళ ప్రభుత్వంపై ఒత్తిడి చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. టోల్‌గేట్స్ వద్ద అధిక మొత్తం దండుకుంటున్నారని, అయ్యప్ప స్వాముల వాహనాలకు ఉచిత ప్రవేశం కల్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలోని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, పాఠశాలల్లో అయ్యప్ప స్వామి దీక్షదారులపై అనేక ఆంక్షలు విధిస్తున్నారని, తక్షణమే వాటిని సడలించాలన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం శబరిలోని నిలకల్ వద్ద అయ్యప్ప స్వాముల కోసం 5 ఎకరాల భూమిని కేటాయించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చిందని, . ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జోక్యం చేసుకొని ఆ స్థలం కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. శబరిమల వెళ్లే స్వాములు ప్రమాదాల్లో చనిపోతే వారి కుటుంబాలకు రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో గురుస్వాములు రాజన్, బసవేశ్వర, శరణ్‌దాస్ , శ్రీనివాస్ , మురళి, సింహం తదితరులు పాల్గొన్నారు.

BEFORE THE DEBTS RECOVERY TRIBUNAL – II TRIVENI COMPLEX, ABIDS, HYDERABAD
SA No. 1172 OF 2017

BETWEEN:
Sri. Mukka Raja Reddy,
Rep. by its Authorized Person ...Applicant
And
Axis Bank,
Rep.by its Authorized Officer and others
..Respondents

To: Respondents No. 2 to 6

R2. M/s Chinnamile Projects LLP, Rep. by its Directors, Situated at # 4th Floor, Flat No. 402, Bhabukhan Estate, Basheerbagh, Hyderabad.

R3. Mr. C. Satyanarayana Reddy, Director of M/s Chinnamile Projects LLP. Situated at # 4th Floor, Flat No. 402, Bhabukhan Estate, Basheerbagh, Hyderabad.

R4. Mr. C. Anji Reddy, Director of M/s Chinnamile Projects LLP, Situated at # 4th Floor, Flat No. 402, Bhabukhan Estate, Basheerbagh, Hyderabad.

R5. Mr. C. Devender Reddy, Director of M/s Chinnamile Projects LLP, Situated at # 4th Floor, Flat No. 402, Bhabukhan Estate, Basheerbagh, Hyderabad.

R6. Mr. C. Mahipal Reddy, Director of M/s Chinnamile Projects LLP, Situated at # 4th Floor, Flat No. 402, Bhabukhan Estate, Basheerbagh, Hyderabad.

... Respondents

It is informed to you, that my client above named applicant filed the above SA No. 1172 of 2017 before the Hon'ble Debt's Recovery Tribunal – II, Hyderabad against you and the same was posted on 04.01.2024 and the Hon'ble Tribunal directed to serve the notice to you. This is for your information and notice for your appearance. If you do not appear on that day i.e. 04.01.2024 the matter will be decided on merits.

Hence this Notice
D.RAGHAVULU, ADVOCATE
(By order of the Hon'ble Debts Recovery Tribunal - II, HYDERABAD)